

బీమాకు నామం!

ఉచిత పంటల బీమాకు కూటమి ప్రభుత్వం పంగనామాలు పెట్టింది. ఇకపై బీమా మొత్తం రైతులే చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. - 8లో



నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్

తిరుపతి కలెక్టరేట్ ధర్నాలతో దద్దరిల్లింది. తమ సమస్యలు పరిష్కరించాలంటూ హమాలీలు, ఆశాలు నిరసన చేపట్టారు. - 8లో



పంట పొలాలపై ఏనుగుల దాడి

పాకాల మండలంలో ఆదివారం అర్ధరాత్రి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. పంటలను తొక్కి సర్వనాశనం చేసింది. - 8లో

న్యూస్‌రీల్

గ్రీవెన్స్‌కు కనీస వసతులు



అర్జీలను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌కు కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత నిర్వాహకులకు ఉందని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుంచి 1.30 గంటల వరకు గ్రీవెన్స్ చేపట్టారు. సోమవారం 'సాక్షి' దినపత్రికలో గ్రీవెన్స్‌కు కనీస వసతులు ఎక్కడ అంటూ.. ప్రచురితమైన వార్తపై ఆయన స్పందించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులకు కనీసం కుర్చీలు ఏర్పాటు చేయడానికి ఇబ్బంది ఎంటి అంటూ నిర్వాహకులను ప్రశ్నించారు. తాగునీటి వసతులు కల్పించాలని ఆదేశించారు. అర్జీదారులతో మర్యాదగా వ్యవహరించాలని, వారి సమస్యలను నిశితంగా తెలుసుకుని పరిష్కరించాలని చెప్పారు. ఇదిలావుండగా సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు 168 అర్జీలు అందగా.. అందులో 109 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే ఉన్నాయని వెల్లడించారు. గడువులోపు ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

మృత్యుంజయుడికి విశేష పూజలు



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ స్వామికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, కలశ స్థాపన చేపట్టారు. అనంతరం స్వామివారికి చందనం, నారికేళ, పసుపు, కుంకుమ, విభూది వంటి వాటితో అభిషేకాలు చేపట్టారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించి మొక్కులు చెల్లించారు.

సాగరంలో శోధన



బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంటు టెస్టు ఫెసిలిటీ పరీక్షా పరికరాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



అనంత సాగరంలో పరిశోధనలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సముద్ర గర్భంలో దాగి ఉన్న రహస్యాలను ఛేదించాలని సంకల్పించింది. అపురూప జలచరాలు.. ఖనిజ సంపదను గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ప్రకృతి విపత్తులను ముందుగా పసిగట్టేందుకు ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీని ప్రారంభించింది. ప్రతిష్టాత్మక సెంటర్‌ను వాకాడు మండలం తూపిలిపాళెంలో ఏర్పాటు చేసింది. ఇందుకోసం రూ.500 కోట్లు వెచ్చించింది. అధునాతన పరికరాల సాయంతో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించే ఈ కేంద్రం ఎలా పనిచేస్తుందో వివరించే విశేషాలతో 'సాక్షి' ప్రత్యేక కథనం.

- తూపిలిపాళెంలో ఓషన్ టెక్నాలజీ కేంద్రం
- జలరాశులు, ఖనిజ సంపదలపై నిత్య పరిశోధనలు
- విపత్తులను ముందుగా పసిగట్టేందుకు శ్రీకారం
- మెరైన్ కోర్సులు చదివిన యువతకు ఉద్యోగావకాశాలు

వాకాడు: అనుకోకుండా 2004 డిసెంబర్ 26న ముంచుకు వచ్చిన సునామీ కారణంగా ఊహకు అందనంత ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. ఇది దృష్టిలో ఉంచుకునే భారత పరిశోధకులు ఇలాంటి విపత్తులు భవిష్యత్‌లో తలెత్తకుండా ముందుగానే పసిగట్టేందుకు ప్రణాళిక రచించారు. అందులో భాగంగానే తొలుత చెన్నైలో ఎన్ఐఓటీ కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడ కొన్ని పరిశోధనలు ప్రారంభించారు. వీటికి మరింత



ఎన్ఐఓటీకి స్థల కేటాయింపు సమయంలో నాటిన బోర్డు

టెక్నాలజీని జోడించి ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం తూపిలిపాళెం వద్ద భారీ ఎన్ఐఓటీ కేంద్రానికి రూ.500 కోట్లతో 2015 మే 25వ తేదీన శ్రీకారం చుట్టింది. ఇది ఎట్టకేలకు గత ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయింది. అయితే ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభోత్సవం వాయిదా పడింది. ఈ క్రమంలోనే వారం రోజుల కిందట ఈ ప్రతిష్టాత్మక సెంటర్‌ను ప్రారంభించారు. కేంద్ర ఎర్త్, సైన్స్ పర్యవేక్షణలో ఈ సెంటర్ నడుస్తుంది. సునామీ, ఇతర వాతావరణ విషయాలను ముందుగానే పసిగట్టేందుకు దోహదపడుతుంది. మెరైన్ కోర్సులు చదివిన నిరుద్యోగ యువతకు ఈ కేంద్రంలో ఉపాధి కల్పనకు అవకాశముంటుంది.

ఎన్ఐఓటీ అంటే ..



ఎన్ఐఓటీ కార్యాలయ భవనం


కేంద్ర ఎర్త్, సైన్స్‌శాఖ 1993లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ కేంద్రాన్ని చెన్నైలో ఏర్పాటు చేసింది. ఈ కేంద్రానికి గవర్నింగ్ కౌన్సిల్‌తో పాటు ఎందరో శాస్త్రవేత్తలను నియమించి సముద్రంలో పరిశోధనలు సాగిస్తున్నారు. సముద్రంలోని జలచర రాశులతోపాటు ఖనిజ సంపదను గుర్తించి వెలికి తీసేలా ఈ కేంద్రం పని చేస్తుంది. గతంలో వివిధ సర్వేలు నిర్వహించగా వాకాడు మండలం, తూపిలిపాళెం సమీపంలోని పామంజి తీర ప్రాంతం ఎక్స్ క్లూజివ్ ఎకనామిక్ జోన్(ఈఈజెడ్)గా గుర్తించారు. అందుకే ఇక్కడ ఎన్ఐఓటీ కేంద్రం ఏర్పాటు చేశారు. దీని ద్వారా సముద్రంలోని లివింగ్ నాన్ లివింగ్ రిసోర్స్ (జలచర, ఖనిజ వనరులు)గుర్తించేలా పరిశోధనలు చేపడుతున్నారు.

వాటర్ ట్రీట్‌మెంట్ టెస్టు ఫెసిలిటీ పరీక్ష కేంద్రం

బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ టెస్టు ఫెసిలిటీ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు పనులు ఇంకా సాగుతున్నాయి. ఇది సముద్రం, నదీ ముఖద్వారాల మధ్య ఏర్పాటు చేయనున్నారు. దీనిని భారతదేశంలోనే తూర్పు తీరంలో వ్యూహాత్మక ఉష్ణ మండల ప్రాంతమైన తూపిలిపాళెం పామంజి తీరంలో ఏర్పాటు చేయనున్నారు. తద్వారా బంగాళాఖాతం నుంచి 35 పీపీటీ సముద్రపు ఉప్పు నీటిని, స్వర్ణముఖి నది ముఖద్వారం నుంచి 15 పీపీటీ నీటిని అలాగే బకింగ్ హామ్ కెనాల్ నుంచి 2 పీపీటీ నీటిని తీసుకుని రెండు పరిణామాల సమూహంలోని 5 రకాల జీవులను ఏక కాలంలో పెంచడానికి అత్యాధునిక స్రోగేట్ పరీక్ష కేంద్రంగా ఇది పనిచేస్తుంది. ఇన్‌లెట్, అవుట్‌లెట్ వాటర్‌ను ఫిజికో కెమికల్, బయోలాజికల్ పరిమితులను విశ్లేషించడానికి ఎన్ఐఓటీ చెన్నై వారు కోట మండలం, చిట్టేడులో ఎన్ఏబీఎల్ గుర్తింపు పొందిన స్టేట్ ఆఫ్ ఆర్ట్ ల్యాబొరేటరీని సైతం ఏర్పాటు చేశారు.

తీరం నుంచే పరిశోధన

సముద్ర గర్భంలో ఏముందో తెలుసుకునే డీప్ ఓషన్ బాటమ్ ప్రెజర్ రికార్డర్ (డీఓపీఆర్), ఎనర్జీ ఫ్రెష్ వాటర్ మెరైన్ సెన్సార్ సిస్టమ్, మెరైన్ బయోటెక్నాలజీ, వ్యవసాయం, టూరిజం అభివృద్ధి, ఓషన్ అకాస్టిక్ అండ్ మోడలింగ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్, ఓషన్ ఎలక్ట్రానిక్ వంటి వాటితో సముద్రం తీరం నుంచే పరిశోధనలు చేస్తారు. భూమిపై ఉండే నిర్మాణాలపై టెక్నాలజీ గ్రూపుతో భూ కంపాలను పసిగడతారు. అదేవిధంగా సముద్ర గర్భంలో ఉన్న మైనింగ్ కాపర్, కోబాల్ట్, నికిల్, మాంగనీస్, నేచురల్ గ్యాస్ వంటివి గుర్తించి వెలికి తీసే పనులు కూడా ఈ ఎన్ఐఓటీ పనిచేస్తుంది. అంతే కాకుండా సముద్రంలో కేబుల్ నెట్‌వర్క్ వేసేందుకు కూడా ఈ కేంద్రం ఉపకరిస్తుంది. సాగర గర్భంలో ఉన్న అత్యంత ఖరీదైన ఖనిజ సంపదపై పరిశోధనలు జరిపేందుకు అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. ఈ కేంద్రానికి అనుబంధంగా కోట మండలం, చిట్టేడు వద్ద పరిపాలనా భవనాలతో పాటు సిబ్బందికి క్వార్టర్స్ సైతం నిర్మించారు. పరిశోధనా కేంద్రం నిర్మాణం, నిర్వహణ ఇతరత్రా ఖర్చుల కోసం తొలుత రూ.75 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిసింది.



బ్యాలస్ట్ వాటర్ ట్రీట్‌మెంటు టెస్టు ఫెసిలిటీ పరీక్షా పరికరం



ఎన్ఐఓటీ పరిశోధనా కేంద్రం యంత్రాల ముఖచిత్రం

దోపిడీ దేదీప్యం!

తిరుపతి కపిలతీర్థంలో అధికారుల దోపిడీ పర్వం దేదీప్యంగా వెలుగొందుతోంది. ఇక్కడ స్వామివారి ప్రత్యేక దర్శనానికి రూ.5 పెట్టి టిక్కెట్ కొనుగోలు చేయాలి. కానీ అధికారులు టిక్కెట్ ఇవ్వరు. అదేమని అడిగితే నలుగురికి కలిపి ఒక టిక్కెట్ రెండుగా చించి ఇస్తున్నారు. మరికొందరు భక్తులు అక్కడున్న అధికారుల చేతిలో రూ.5 పెట్టి దర్శనానికి వెళ్తున్నారు. ఇక పూజాసామగ్రి విషయానికొస్తే నాసిరకం అగ్గిపెట్టె, అగరఒత్తులు, నేతి దీపాలు విక్రయిస్తూ భక్తులను నిలువుదోపిడీకి గురిచేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదులు వెళ్తున్నా పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- కపిలతీర్థం శివాలయంలో అధికారుల నిలువు దోపిడీ
- ప్రత్యేక దర్శన టికెట్ కొన్నా.. టోకెన్ ఇవ్వరు
- అడిగితే నలుగురికి కలిపి ఒక టికెట్.. ఆ టికెట్ రెండుగా చించి ఇస్తున్న వైనం
- రోజూ భక్తుల నుంచి వసూలు చేస్తున్న డబ్బు ఎవరి జేబులోకి?
- ఆలయం వద్ద నాసిరకం పూజా సామగ్రి



కపిలతీర్థంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కార్తీక మాసంలో భక్తులు నిలువుదోపిడీకి గురవుతున్నారు. ఆలయాలకు వచ్చే భక్తుల నుంచి కొందరు అధికారులు, వ్యాపారులు దేవుడిపేరు చెప్పి దండుకుంటున్నారు. ఇదెక్కడో కాదండోయ్ తిరుపతిలోని కపిలేశ్వరస్వామి ఆలయంలో. అక్కడి అధికారులు, అక్కడి వ్యాపారులు కుమ్మక్కై భక్తుల జేబులు గుల్లచేస్తున్నారు. కార్తీక మాసాన్ని దృష్టిలో ఉంచుకుని కపిలేశ్వరస్వామి ఆలయానికి రోజూ వేలాది మంది భక్తులు దర్శనం కోసం వచ్చి వెళ్తుంటారు. సోమ, శనివారం అయితే భక్తుల రద్దీ రెండింతలు ఉంటుంది. కార్తీక మాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని శ్రీకపిలేశ్వరాలయానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

నాసిరకం పూజాసామగ్రి

స్వామి వారి పూజ కోసం నెయ్యి లేదా దీపం నూనె, కొబ్బరికాయ, అగరబత్తీ, పూలు, పండ్లు, ఆకువక్క, పసుపు, కుంకుమ కొనుగోలు చేస్తున్నారు.. కార్తీక మాసం కావడంతో ఎక్కువశాతం మంది భక్తులు ప్రత్యేకంగా మారేడు దళం, ఉసిరి కాయతో నెయ్యి దీపం వెలిగిస్తున్నారు. ఈ మొత్తం పూజా సామగ్రి కేవలం ఒకరిద్దరు వ్యాపారుల వద్ద మాత్రమే దొరుకుతున్నాయి. కార్తీక మాసం కావడంతో ఎక్కువ మంది భక్తులు మారేడు దళం, ఉసిరి కాయను కత్తిరించి రెండు పత్తి ఒత్తిలు పెట్టి అందులో నెయ్యి పోసి దీపం వెలిగించడం కనిపించింది. సాధారణంగా అయితే రెండు ఉసిరి కాయలు, అందులో పత్తితో ఒత్తులు నేతిలో ముంచి పెట్టి ఇస్తారు. అయితే కపిలేశ్వరస్వామి ఆలయం ముందు ఉన్న వ్యాపారులు అన్నీ విడి విడిగా ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. ఉసిరి కాయను బట్టి రేటు.. పెద్దవి అయితే రూ.30. చిన్నవి అయితే రూ.20. నెయ్యి ప్యాకెట్ రూ.10. ఇందులో నెయ్యి ఐదు చుక్కలకు మించి ఉండదు. అది కూడా నాసిరకం. వీటితో పాటు మిగిలిన సామగ్రి కూడా భక్తులు కొనుగోలు చేయడం సర్వసాధారణంగా కనిపించింది. పూలు విడిగా కావాలంటే మూర రూ.40. పూలు కాకుండా మొత్తం సామగ్రికి రూ.100 చెల్లిస్తే కానీ పూజ సామగ్రి రాదు. ఇందులో నెయ్యి, అగ్గిపెట్టె, అగరబత్తీ పూర్తిగా నాసిరకం. ఉసిరి కాయలు కాకుండా.. మట్టితో తయారు చేసిన ప్రమిద, అందులో 101 ఒత్తులు, అత్యంత నాసిరకమైన నెయ్యి కలిపి విక్రయిస్తున్నారు. వీటికి మరో రేటు. అగ్గిపెట్టె విడిగా కొనుగోలు చేయాలి. ఇవన్నీ తీసుకుని పుణ్యస్నానం అనంతరం పూజా సామగ్రి అంతా పెట్టి దీపం వెలిగిద్దాం అంటే అగ్గిపుల్ల వెలగదు. పెట్టెలోని అన్ని పుల్లలూ గీసినా దీపం వెలిగించాలంటే సాహసమే చేయాల్సి వస్తోంది. ఇదంతా అయ్యాక అగరబత్తీ వెలిగిద్దాం అంటే.. అవీ అత్యంత నాసిరకం. ఇదీ శ్రీకపిలేశ్వరస్వామి ఆలయంలో భక్తుల అవస్థలు.

ప్రత్యేక దర్శనం పేరుతో..

పుణ్యస్నానాలు ఆచరించి దీపాలు వెలిగించాక స్వామిని దర్శనం చేసుకోవాలనే భక్తులు ప్రత్యేక దర్శనం క్యూలో ప్రవేశించారు. ఆలయంలోకి వెళ్లక ముందు కౌంటర్ వద్ద ఒకరికి రూ.5 ప్రత్యేక దర్శనం టికెట్ అని చెప్పి వసూలు చేస్తున్నారు. రూ.5 చెల్లిస్తే కంప్యూటరైజ్డ్ టికెట్ ఇవ్వాలి. అయితే టికెట్ కౌంటర్ వద్ద ఉన్న ఆలయ అధికారి ఒకరు రూ.5 చొప్పున వసూలు చేసినా టికెట్ ఇవ్వడం లేదు. భక్తులు కూడా రూ.5 చొప్పున ఆయన చేతిలో పెట్టి వెళ్తున్నారు. ఒకరో ఇద్దరో టికెట్ అడిగితే.. నలుగురికి కలిపి ఒక స్లిప్‌ని కంప్యూటర్ నుంచి తీసి ఇస్తారు. ఆ టికెట్‌ని రెండుగా చించి ఇద్దరికి ఒకటి చొప్పున ఇచ్చి పంపేస్తున్నారు. ఈ డబ్బు ఆలయ అభివృద్ధికి చేరుతుందా? కొందరు ఆలయ అధికారుల జేబులోకి వెళ్తుందా? అని భక్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

టిక్కెట్ ఇవ్వకుండా ఉండరు

"శ్రీకపిలేశ్వరాలయంలో స్వామివారి ప్రత్యేక దర్శనానికి భక్తుల వద్ద డబ్బు తీసుకొని టిక్కెట్ ఇస్తారు. డబ్బులిచ్చినా టిక్కెట్ ఇవ్వకుండా ఉండే పరిస్థితి లేదు. నాణ్యత లేని పూజా సామగ్రి విషయమై ఆలయం బయట జరిగే వాటితో మాకు సంబంధం లేదు. భక్తుల వద్ద నుంచి రూ.5 డబ్బు తీసుకొని టిక్కెట్ ఇవ్వకుండా పంపించి ఉంటే నాకు రిపోర్టు చేయొచ్చు. మీకు చించి ఇచ్చిన టిక్కెట్ రేపు తీసుకురండి.. చూద్దాం. – దేవేంద్రబాబు, శ్రీకపిలేశ్వరస్వామి ఆలయ డెప్యూటీ ఈఓ.

మహా దీపోత్సవం





తిరుపతిలో కార్తీక దీపోత్సవం(ఇన్‌సెట్) విశేష అలంకరణలో మలయప్ప స్వామి

తిరుపతి జిల్లాలో కార్తీక మూడో సోమవారాన్ని ఘనంగా నిర్వహించారు. పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి మహిళా భక్తులు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలోని మైదానంలో కార్తీక మహా దీపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజ తీర్థంలో లక్ష దీపోత్సవాన్ని ఏర్పాటు చేశారు. భక్తులు తండోపతండాలుగా తరలివచ్చి దీపాలు వెలిగించారు. – తిరుపతి కల్చరల్/ శ్రీకాళహస్తి





కాంతులీనుతున్న శ్రీకాళహస్తిలోని భరద్వాజ తీర్థం

సమాన అవకాశాలతోనే మహిళా సాధికారత



ఐఐటీ విద్యార్థులతో అతిథులు

రేణిగుంట(ఏర్పేడు): సమాన అవకాశాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని జాతీయ మానవ హక్కుల కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ విజయభారతి సాయని అభిప్రాయపడ్డారు. ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీలో సోమవారం 'మహిళల హక్కులు– ఆహార భద్రత' అంశంపై ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కెఎన్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె జాతీయ మానవ హక్కుల కమిషన్ డీజీ అజయ్ భట్నాగర్‌తో కలసి పాల్గొని ప్రసంగించారు. ఐఐటీలో నీతి భోద్ క్లబ్, నేషనల్ సర్వీస్ స్కీమ్ సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఐఐటీ డైరెక్టర్ మానవ హక్కులు, మహిళల సంక్షేమానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను ప్రస్తావించారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ తాత్కాలిక చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళల శ్రేయస్సు, సాధికారతకు ప్రాథమికమైన వనరులకు సమాన ప్రాప్తిని కలిగి ఉండేలా సమిష్టి కృషి అవసరమన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అజయ్ భట్నాగర్ మాట్లాడుతూ మహిళల భద్రతలోని వివిధ కోణాలను, చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ల నుంచి సామాజిక వైఖరులను వివరించారు. కార్యక్రమంలో ఐఐటీ ప్రొఫెసర్లు, నీతిభోద్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బీమాకు నామం!

- పంటలకు ఉచిత బీమా ఇక లేనట్టే
- 1.36 లక్షల మంది రైతులపై బీమాభారం
- లబోదిబోమంటున్న అన్నదాతలు



సాగుకు చదును చేస్తున్న రైతు (ఫైల్)

తిరుపతి అర్బన్: ఉచిత పంటల బీమా.. రైతులకు ధీమా అన్న మాటలను కూటమి ప్రభుత్వం చెరిపేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పక్కాగా అమలుచేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడేసింది. రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇకపై రైతులపైనే పంటల బీమా భారం పడనుంది. వరి పంటలకు ఎకరాకు పంట రకాన్ని బట్టి రూ.600 నుంచి రూ.650 వరకు ప్రీమియాన్ని చెల్లించాల్సి ఉంటుంది. వేరుశనగకు రూ.450 కట్టాల్సి ఉంటుంది.

భారాన్ని మోయాల్సిందేనా

రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ప్రీమియం భారాన్ని మోయాల్సిందేనా అని రైతులు ఆవేదన చెందుతున్నారు. గతంలో రుణాలు తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకులు, సొసైటీలు పంటల బీమా సొమ్ము చెల్లించేవి. ఆ సొమ్మును తర్వాత రైతుల నుంచి వసూలు చేసేవి. దీంతో ఏదైనా విపత్తులతో పంట నష్టపోతే నష్ట పరిహారం సదరు సంస్థల నుంచి అందేది. అయితే రుణాలు తీసుకోని రైతులకు బీమా వచ్చేదికాదు. దీంతో గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందరి రైతులకు నష్టపరిహారం అందేలా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేసింది. క్షేత్ర స్థాయిలో ఈ–క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకూ ఉచిత పంటల బీమా అమలు చేసింది. దీనిని కూటమి ప్రభుత్వం రద్దు చేసింది.

అన్నదాతా దుఃఖీభవ



అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రభుత్వం రైతులకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని ఎన్నికల సమయంలో ఊదరగొట్టారు. తీరా అధికారం చేపట్టిన తర్వాత పెట్టుబడి సాయం ఊసెత్తకపోవడంతో రైతులు సాగు ఖర్చులకు అప్పులబాట పట్టాల్సి వస్తోంది. ఇటువంటి పరిసితుల్లో రైతులపైనే బీమా భారాన్ని మోపడం బాధాకరం. –గంగయ్య, రైతు

భారంగా పెట్టుబడులు



పెట్టుబడుల భారం రైతులను కుదేలు చేస్తున్నాయి. గతంతో పోల్చుకుంటే రానురానూ పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. పంట చేతికి వచ్చే దాకా ఖర్చు పెట్టాల్సి రావడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక మొత్తానికి వడ్డీలు తెచ్చుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతుకు అండగా ఉండాలి.

– వెంకటరత్నం, రైతు

గత ప్రభుత్వంలో రైతు సుభిక్షం



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు చేదోడు వాదోడుగా ఉండేది. పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా పథకం, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అవసరాలు తీర్చడం వంటి పనులు చేసింది. రైతులకు అత్యంత ప్రయోజకరంగా ఉచిత పంటల బీమా ఉండేది. అలాంటి పరిస్థితులు లేకుండా పోయాయి.

– ఆర్.శేఖర్, రైతు

క్లుప్తంగా

శివయ్య సేవలో రైల్వే ఐజీ



ఆలయం వద్ద రైల్వే ఐజీ ఈశ్వరరావు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రైల్వే ఐజీ ఈశ్వరరావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

గంజాయి కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్ : అక్రమంగా గంజాయి కలిగిన కేసులో తిరుపతి ఎంఆర్‌పల్లి, శాంతినగర్‌కు చెందిన అరగొండ భానుప్రకాష్‌కు ఈనెల 29వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ సత్యకాంత్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీచేశారు. నిందితుడు భానుప్రకాష్ తిరుపతి, సీతమ్మనగర్ 80 అడుగుల రోడ్డు వద్ద అక్రమంగా గంజాయి కలిగి ఉండడంతో ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

36 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 36 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పుచెప్పారు. తిరుపతి నగరంలో ట్రాఫిక్ పోలీసులు పలుచోట్ల అర్బన్ ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు. మద్యం తాగి నగరంలో వాహనాలను నిర్లక్ష్యంగా నడుపుతున్న 36 మంది పై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఆయన పేర్కొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 25 ఫిర్యాదులు

తిరుపతి క్రైం: తిరుపతి జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 25 ఫిర్యాదులు అందినట్లు ఏఎస్పీ వెంకటరావు తెలిపారు. ఇందులో దొంగతనాలు, ఆస్తి తగాదాలు, ఆర్థికపరమైన లావాదేవీలు ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. వెంటనే సదరు ఫిర్యాదులను పరిష్కరించాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు.

పంట పొలాలపై ఏనుగుల దాడి

పాకాల: పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి దామలచెరువు పంచాయతీ, మొరవపల్లి, కాకర్లవారిపల్లి గ్రామాల్లో చోటు చేసుకుంది. ఆయా గ్రామాల్లో వరి, మామిడి, అరటి తోటలు, కాకర, కొబ్బరి చెట్లను నాశనం చేశాయి. సోమవారం చంద్రగిరి ఉద్యాన అధికారిణి శైలజ పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను పరామర్శించారు. పంట నష్ట పరిహారం అందించాలని బాధిత రైతులు అభ్యర్థించారు.

నిరసనలతో దద్దరిల్లిన కలెక్టరేట్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

- జీతాలు ఇవ్వలేదని హమాలీలు
- ఒప్పంద జీవోను అమలు చేయాలని ఆశావర్కర్ల డిమాండ్

తిరుపతి అర్బన్: నిరసనలతో కలెక్టరేట్ సోమవారం దద్దరిల్లింది. 18వ తేదీ వచ్చినా ఇంత వరకు వేతనాలు ఇవ్వలేదంటూ హమాలీలు ధర్నా చేపట్టారు. వారికి ఏఐటీయూసీ నేతలు మద్దతు పలికారు. ఈ సందర్భంగా నేతలు మురళి, రాధాకృష్ణ మాట్లాడుతూ సివిల్ సప్లయ్‌కి చెందిన హమాలీలకు అగ్రిమెంట్ ప్రకారం జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. బస్తాకు రూ.3 ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకుని.. ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమస్య పరిష్కారం కాకుంటే సమ్మెకు సిద్ధమవుతారని హెచ్చరించారు. ఆ మేరకు వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు అందించారు. ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్ రెడ్డి, ఎన్డీ రవి, చెంచయ్య, శీను, పాండు, బాబు, కార్తీక్, సురేష్ గణేష్ పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు తీరని అన్యాయం

ఆశావర్కర్లుకు ప్రభుత్వం అన్యాయం చేస్తోందని పలువురు వాపోయారు. కలెక్టరేట్ వద్ద ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కవితా నేతృత్వంలో ధర్నా చేపట్టారు. వారికి సీఐటీయూ నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొమ్మినెలల క్రితం ఆశావర్కర్లతో చేసుకున్న ఒప్పందం జీవోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ వయోపరిమితి 60 నుంచి 62 ఏళ్ల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత బెనిఫిట్ స్కీమ్ ద్వారా రూ.60 వేలు ఇవ్వాలన్నారు. అలాగే మృతి చెందిన వారికి బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. సీఐటీయూ నేతలు బాలసుబ్రమణ్యం, జయచంద్ర, వేణుగోపాల్, ఆశావర్కర్స్ యూనియన్ నేతలు ఆర్.లక్ష్మి, సుజాత, పీ.లక్ష్మి పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుకు సాదర వీడ్కోలు



సీఎం చంద్రబాబుకు వీడ్కోలు పలుకుతున్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. ఆయన నారావారిపల్లెలో తన తమ్ముడు, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే రామ్మూర్తి నాయుడు అంత్యక్రియల కార్యక్రమాలను ముగించుకుని సోమవారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం ఇక్కడి నుంచి హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్లారు. ఆయనతోపాటు రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ఉన్నారు. వారికి విమానాశ్రయంలో వీడ్కోలు పలికిన వారిలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, డీఐజీ షిమోషిబాజ్‌పాయ్, ఎస్పీ సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, అమరనాథరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులున్నారు.

తిరుగుప్రయాణమైన సీఎం చంద్రబాబు

చంద్రగిరి: తన తమ్ముడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు అంత్యక్రియలకు హాజరైన సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం నారావారిపల్లి నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఉదయం నుంచి ఇంటికే పరిమితమైన ఆయన గ్రామంలోని స్థానికులను పిలిపించి కాసేపు మాట్లాడారు. అనంతరం ఈ నెల 28వ తేదీన నారా రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు సంబంధించి ఏర్పాట్లపై గ్రామస్తులు, బంధువులతో చర్చించినట్లు తెలుస్తోంది. తదుపరి తన నివాసం వద్ద కార్యాలయంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులతో పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. అయితే సీఎం చంద్రబాబు నిర్వహించిన సమావేశ విశేషాలను బహిర్గతం చేయలేదు. అనంతరం మధ్యాహ్నం 2.45 గంటలకు తన నివాసం నుంచి రేణిగుంట ఎయిర్‌పోర్టుకు రోడ్డు మార్గాన వెళ్లారు. అక్కడ నుంచి మంత్రి లోకేష్‌తో కలసి వెళ్లినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

భూ ఆక్రమణలు పట్టించుకోని అధికారులు

పెళ్లకూరు: మండలంలోని ఆర్లపాడు గ్రామ సర్వే నం.301/9లో తన పేరుతో ఉన్న 14 సెంట్ల భూమిని టీడీపీ నాయకులు ముగ్గురు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు గోపీనాథ్‌రెడ్డి సోమవారం ఆరోపించారు. ఈ విషయమై ఈ నెల 16న ఫిర్యాదు చేసినా పోలీసులు, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. ఆ ముగ్గురూ ఫోన్ చేసి తన భూములకు సంబంధించిన అడంగళ్‌లో పేర్లు తొలగిస్తామని బ్లాక్ మెయిల్ చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై గత నెల 28న పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. అదేవిధంగా వారు తన వ్యవసాయ భూమి చుట్టూ ఉన్న 130 ఫెన్సింగ్ రాళ్లను తొలగించారని పేర్కొన్నారు. సర్వే నం.319/1లో ఉన్న తన సాగునీటి బావిని బాంబులు పెట్టి పేల్చేసిన విషయమై రెండేళ్ల క్రితం పెళ్లకూరు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై స్థానిక ఎస్‌ఐ కె.నాగరాజు వివరణ ఇస్తూ ఇరువర్గాల మధ్య జరుగుతున్న భూవివాదాలకు సంబంధించి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

నేడు సీడాప్ జాబ్ కనెక్ట్

తిరుపతి అర్బన్: తిరుపతిలోని టీటీడీసీ ప్రాంగణంలో మంగళవారం సీడాప్ జాబ్ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభనబాబు సోమవారం తెలియజేశారు. తిరుపతి, శ్రీకాళహస్తి ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే సీడాప్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) నేతృత్వంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు హాజరుకావాలని చెప్పారు. ఫ్యూషన్ ఫైనాన్స్ లిమిటెడ్ సహకారంలో రిలేషన్ షిప్ ఆఫీసర్ ఉద్యోగాల కోసం నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యువతీ యువకులు 19–35 ఏళ్ల వయసు వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఇంటర్ లేదా డిగ్రీ అర్హత ఉండాలని తెలిపారు. ద్విచక్ర వాహనంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ తప్పకుండా ఉండాలని స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్‌తోపాటు మరిన్ని వివరాల కోసం 97013 87293, 63022 80583ను సంప్రదించాలని సూచించారు.

మద్యం అక్రమ విక్రయాలపై ఎక్సైజ్ దాడులు



మహిళను అరెస్ట్ చేసిన రూరల్ ఎక్సైజ్ పోలీసులు

తిరుపతి రూరల్: మద్యం అక్రమ విక్రయాలపై తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిల్ పోలీసులు దాడులు చేశారు. సోమవారం రేణిగుంట మండలం గాజులమండ్యంలో తనిఖీలు చేశారు. సుమతి అనే మహిళ వద్ద 10 మద్యం బాటిళ్లను గుర్తించి, విక్రయిస్తున్నట్లు నిర్ధారించారు. ఆమెను అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తిరుపతి రూరల్ ఎక్సైజ్ సర్కిల్ సీఐ నరసానాయుడు తెలిపారు. ఎస్‌ఐలు అంజలిప్రసన్న, కవీశ్వరనాయుడు పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై విచారణ



కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో శ్రీహరి



రేణిగుంటలో ఓ ప్రైవేట్ క్లినిక్‌ను సీజ్ చేసిన వైద్యాధికారులు

రేణిగుంట: రేణిగుంట మండలం, మర్రిగుంట సమీపంలోని వీబీఆర్ జవన్య నర్సింగ్ కళాశాలలో కలుషితాహారం తిని విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరి, మండల వైద్యాధికారి డాక్టర్ ఛత్రప్రకాష్ రెడ్డి కళాశాల వద్దకు చేరుకుని విద్యార్థినులను విచారించారు. ఐదుగురి విద్యార్థినులను చికిత్స నిమిత్తం బాలాజీ ఆస్పత్రికి తరలించారు. ఆహారం విషతుల్యం ఎలా అయ్యిందని విద్యార్థులను, కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. శనివారం నుంచి విరేచనాలు అవుతున్నట్లు గుర్తించి స్వల్ప లక్షణాలున్నా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. విద్యార్థినుల రక్త, మల, మూత్ర నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

అర్హత లేకుండా చికిత్స చేసిన క్లినిక్‌లు సీజ్

ఈ ఘటనలో వైద్యం చేసేందుకు అర్హత లేని రేణిగుంటకు చెందిన పలు ప్రైవేటు క్లినిక్‌ల సిబ్బంది నేరుగా హాస్టల్‌కు వెళ్లి వైద్యం చేయడం పట్ల డీఎంహెచ్‌వో శ్రీహరి సీరియస్ అయ్యారు. నేరుగా హాస్టల్‌కు వెళ్లి వైద్యం చేసే అధికారం ఎవరిచ్చారని వారిని ప్రశ్నించారు. రేణిగుంట పట్టణంలోని నారాయణ క్లినిక్, మరో ఐదు క్లినిక్‌లను తనిఖీ చేసి నిబంధనలను పాటించకపోవడంతో వాటిని సీజ్ చేశారు. అర్హతా ప్రమాణాలను పాటించని మొత్తం 12 క్లినిక్‌లను పట్టణంలో సీజ్ చేశారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించిన క్రీడాకారులు

తిరుపతి కల్చరల్: విజయవాడలో ఆదివారం జరిగిన ఏపీ స్పోర్ట్ కరాటే చాంపియన్‌షిప్ రాష్ట్ర స్థాయి పోటీలలో తిరుపతికి చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభతో బంగారు పథకాలు సాధించారు. ఏపీ స్పోర్ట్స్ కరాటే చాంపియన్ షిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 700 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో తిరుపతి నుంచి అండర్ 5–21 మధ్య 30 మంది బాలబాలికలు పాల్గొని ఉత్తమ ప్రతిభతో పతకాలు సాధించారు. కటా విభాగంలో జోగేశ్వర్(అండర్–5), ఎస్.కున్వీ (అండర్–6), బి.మిత్ర(అండర్–10) బంగారు పతకాలు సాధించారు. కుమితే విభాగంలో నిత్యశ్రీ (బి.లిఖిత్‌కుమార్(అండర్–11) బంగారు పతకాలు కైవశం చేసుకున్నారు. మిగిలిన 17 మంది సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిని స్కేడాప్ అధ్యక్షుడు డాక్టర్ మిల్టన్‌శాస్త్రి, స్కేడాప్ టీమిండియా కోచ్‌లు కీర్తన్, పి.నవీన్ విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

నేడు, రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు




మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీకి చెందిన కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్(సీపీటీ)కు సంబంధించి పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. పరీక్షల నిర్వహణపై సోమవారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పుత్తూరు మండలం చిన్నరాజకుప్పంలోని శ్రీవెంకట పెరుమాళ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు సీపీటీ పరీక్ష మూడు సెషన్స్‌లో జరుగుతుందని స్పష్టం చేశారు. ఉదయం 9.30 నుంచి 10.30 వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటల వరకు సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఉంటుందన్నారు. 677 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. పరీక్ష కేంద్రాల్లోకి విద్యుత్ పరికరాలు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీపీఎస్సీ నుంచి అసిస్టెంట్ సెక్రటరీ సురేష్‌బాబు, సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు స్విమ్మింగ్ జిల్లా స్థాయి పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలోని స్విమ్మింగ్ పూల్‌లో మంగళవారం సాయంత్రం 7గంటలకు జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు, ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఆ మేరకు చిత్తూరు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఈటీ.గోపీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు 2007 నుంచి 2014లోపు జన్మించిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో హాజరవ్వాలని, మరిన్ని వివరాలకు 81217 77077ను సంప్రదించాలని ఆయన కోరారు.

వృద్ధురాలి కంట్లో స్ప్రే కొట్టి చైన్ స్నాచింగ్



వృద్ధురాలిని విచారిస్తున్న పోలీసులు

పాకాల : ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని పసిగట్టి కంట్లో స్ప్రే కొట్టి బంగారు గొలుసు అపహరించిన ఘటన పాకాలలో చోటు చేసుకుంది. స్థానికులు సోమవారం తెలిపిన వివరాల మేరకు భారతంమిట్ట 6వ క్రాస్‌లో కాంతమ్మ(80) ఒంటరిగా నివాసం ఉంటోంది. బాధితురాలి కుమారుడు దొరబాబు కువైట్‌లో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంట్లో పనిమనిషి పనులు ముగించుకుని వెళ్లిన తరువాత గుర్తుతెలియని మహిళ ముఖానికి ముసుగు ధరించి ఇంట్లోకి చొరబడింది. కాంతమ్మ కంట్లో స్ప్రే కొట్టి ఆమె మెడలోని సుమారు 22 గ్రాముల బంగారం అపహరించుకెళ్లింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పట్టపగలు ఇలాంటి దొంగతనాలు జరుగుతుంటే ధైర్యంగా ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోయారు. పగలు, రాత్రి అని తేడా లేకుండా పోలీసులు గస్తీ నిర్వహించాలని స్థానిక మహిళలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వేతన వెతలు

- వర్సిటీలో ఇప్పటికీ అందని జీతాలు



వీరి పరిస్థితి మరీ దారుణం

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా మారింది. నెల పూర్తికావస్తున్నా శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులకు, పెన్షనర్లకు నవంబర్ నెల వేతనాలు ఇంతవరకు అందకపోవడంతో సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలలో భాగంగా ప్రతి వేతన జీవికి ఒకటో తారీఖున వేతనాలు చెల్లిస్తామని ప్రగల్భాలు పలికింది. కానీ అధికారం చేపట్టి ఏడు నెలలు కావస్తున్నా ఒక్క నెలలో కూడా ఒకటో తారీఖున వేతనాలు చెల్లించిన దాఖలాలు లేవు. ఈఎంఐలు, ఇంటి బాడుగలు, నిత్యావసరాలు, పాఠశాల ఫీజులు వంటి నెలవారీ ఖర్చుల కోసం బోధన, బోధనేతర సిబ్బంది అప్పులు చేస్తూ జీవనం సాగించాల్సి వస్తోంది.

వర్సిటీలో సుమారు 263 మందికిపైగా అకడమిక్ కన్సల్టెంట్లు పనిచేస్తున్నారు. వీరికి గత రెండు నెలలుగా సర్వీసు పొడిగించకుండా, వేతనాలను చెల్లించకుండా వర్సిటీ అధికారులు నరకం చూపిస్తున్నారు. అక్టోబర్, నవంబర్ మాసాలకు సంబంధించి సర్వీసు రెన్యూవల్ ఉత్తర్వులు ఇవ్వలేదు. దీంతో వేతనాల విషయం అయోమయంలో పడింది. 110జీవోను అమలు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నట్టు పలువురు ఆరోపిస్తున్నారు.

చీకట్లో గురుకులం



చీకట్లో భోజనం చేస్తున్న సత్యవేడు గురుకులం విద్యార్థినులు

సత్యవేడు: అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల హాస్టల్‌లో చీకట్లు అలముకున్నాయి. విద్యార్థినులు చీకట్లోనే భోజనాలు చేస్తూ అవస్థలు పడుతున్నారు. సోమవారం మధ్యాహ్నం భోజన సమయంలో మబ్బులు మూసుకోవడంతో చీకటి అలముకొంది. హాస్టల్‌లో సుమారు 400 మంది విద్యార్థినులు ఉన్నారు. భోజనశాలలో 24 ట్యూబ్‌లైట్లు ఉండగా.. అందులో నాలుగు మాత్రమే వెలుగుతున్నాయి. మిగిలిన 20 లైట్లు వెలగక పోవడంతో భోజనశాలలో విద్యార్థినులు చీకట్లోనే అవస్థలు పడాల్సి వచ్చింది. ఇదిలావుండగా పాఠశాలకు చెందిన దివ్య దర్శిని(8వతరగతి), నవ్యశ్రీ(జూనియర్ ఇంటర్), బీ.వెన్నెల (5తరగతి) కే.అక్షర (6వ తరగతి) జ్వరంతో బాధపడుతున్నారు.

శిథిలావస్థలో భవనాలు: సత్యవేడులోని బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. గదుల కొరత విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ గదులు వర్షానికి ఉరుస్తున్నాయి. ఇంటర్ బీసీ బాలుర హాస్టల్ శ్లాబు పెచ్చులూడి పడుతోంది.